నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

వేతనాలు చెల్లించేందుకు అంగీకారం

- లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా : సీపీఐ(ఎం)



చర్చల్లో అధికారులు, కార్మిక నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిజామాబాద్ జిల్లా లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో బుధవారం చర్చలు జరిగాయి. రెండు రోజుల్లో రెండు నెలల వేతనాలు చెల్లించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ అంగీకరించినట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్, యూనియన్ నాయకులతో చర్చల సందర్భంగా సమ్మె కాలపు వేతనాన్ని సైతం చెల్లించాలని నిర్ణయం మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

రుణం మాఫీ కాలేదు..

అధికారుల వద్దకు వెళ్లిన బాధితులు



కార్యాలయానికి వచ్చి వెళ్తున్న రైతులు

నవతెలంగాణ-బాల్కొండ

రైతు రుణమాఫీ రాలేదంటూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు బుధవారం మండల వ్యవసాయ కార్యాలయానికి, మండల పరిధిలోని రైతు వేదికలకు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా మంగళవారం రూ.1.50 లక్షలోపు రైతు రుణమాఫీ ప్రకటించింది. అందులో లబ్ధి పొందని రైతులు అధికారుల వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఏట మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాధిత రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్నామని, ఈ వివరాలను అధికారులకు అందజేస్తామని తెలిపారు.

నవతెలంగాణ ఎఫెక్ట్
ఎట్టకేలకు సమీకృత భవనం ప్రారంభం

- ప్రారంభించిన ఆర్డీవో రమేశ్ రాథోడ్



కార్యాలయానికి వచ్చిన అధికారులు



ఉత్సవ విగ్రహంలా సమీకృత భవనం

నవతెలంగాణలో ప్రచురితమైన కథనం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రజల సౌకర్యార్థం కోసమే ప్రభుత్వం సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నట్లు బన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. బుధవారం నసురుల్లాబాద్ సొసైటీ భవనం నుండి మండల సమీకృత సముదాయ భవనంలోకి తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈనెల 23న నవతెలంగాణ పత్రికలో ఉత్సవ విగ్రహంలా మండల సమీకృత భవనం అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ వెంటనే మండల సమీకృత భవనం పనులు పూర్తి చేయాలంటూ ఆదేశించారు. అధికారులు కాంట్రాక్టర్లు వారం రోజుల్లో పనులు పూర్తి చేసి మండల రెవెన్యూ కార్యాలయాని ప్రారంభానికి కృషి చేశారు.



బుధవారం ఉదయం బాన్సువాడ ఆర్డీవో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ నూతన తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. నసురుల్లాబాద్ మండలం అభివృద్ధిలో భాగంగా మండల సమీకృత భవనం ఏర్పాటుతో మండల మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజలు అధికార యం త్రాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు అద్దె గదుల్లో, అసౌకర్యాలతో కార్యాలయాలు కొనసాగడంతో అధికారులకు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. వాన కురిస్తే భవనాలు ఊరువడంతో తిప్పలు పడ్డారు. మండల సమీకృత భవనం నిర్మాణంతో ఆ వెతలన్నీ తీరనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోటకు రావడంతో అధికారులతో పాటు ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. పాలన చేరువ కానున్నది. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలు వేగంగా అమలు కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ ఐ హన్మాండ్లు, రెవెన్యూ సిబ్బంది మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో మరోసారి
మధ్యతరగతి మోసపోయింది

- కేంద్ర బడ్జెట్ కార్పోరేట్‌లకు, ధనవంతులకే
- సెమినార్‌లో ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకులు కెవిఎస్ఎన్ రాజు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ కార్పొరేట్లకు, ధనవంతులకు అనుకూలంగా ఉందని, మధ్య తరగతిని పూర్తిగా విస్మరించిందని ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకులు కె. వి. ఎస్.ఎన్ రాజు అన్నారు. బుధవారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నాయకులు ఈవియల్ నారాయణ అధ్యక్షతన జరిగిన కేంద్ర బడ్జెట్- మధ్యతరగతిపై ప్రభావం సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను చెల్లించే వారి సంఖ్య పెరుగుతూ దేశ ఆర్థికం లో 19% వాటా ఉందని, అదే పరిస్థితుల్లో కార్పొరేట్ల చెల్లించే పన్ను 17 శాతం వాటా ఉందని, ప్రభుత్వ విధానాల మూలంగా కోట్లు సంపాదించి, పన్ను చెల్లించగలిగిన వారికి రాయితీలు, బడుగు బలహీన వర్గాల వారికి, మధ్యతరగతి వారి నుండి మాత్రం ముక్కు పిండి పన్నుల పేరా వసూలు చేస్తున్నారని విమర్శించారు. క్యాపిటల్ గెయిన్స్ పైన కూడా పన్ను పెంచారని, కోట్లు రుణాలుగా తీసుకొని బ్యాంకులను మోసం చేసి దర్జాగా తిరుగుతున్న వారి వద్దనుండి రూపాయి వసూలు చేయలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్లో రైతులకు, కార్మికులకు మొండి చేయి చూపించిందని, మహిళోద్ధరణ గురించి మాట్లాడే వారు కోటి మంది



మాట్లాడుతున్న కెవిఎస్ఎన్ రాజు

పనిచేస్తున్న స్కీం వర్కర్ల గురించి ఊసే లేదని, 40 సంవత్సరాలపాటు ప్రజల కోసం , ప్రభుత్వంలో పనిచేసిన ఈపీఎస్ పెన్షనర్లకు నెలకు 2000 రూపాయలు వస్తున్న వారి పెన్షన్ను మాత్రం రూపాయి కూడా పెంచలేదని, ఇలాంటివారు 60 లక్షల మంది పైగా ఉన్నారని తెలిపారు. ఒక్క శాతం ఉన్న అంబానీ ఆదానీ లాంటి వారి ప్రయోజనాల కోసం ఈ బడ్జెట్ రూపొందించిందని అన్నారు. భారతదేశం నేడు ఒక కోటి 68 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, ఈ డబ్బు ఎవరికోసం ఖర్చు పెట్టిందని ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సెమినార్లో ఉద్యోగ జిల్లా నాయకులు శ్రీధర్, శిర్ప హనుమాన్లు, మధుసూదన్, హుస్సేన్, రామ్మోహన్రావు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులు దహనం

- కేంద్రానిది రైతు వ్యతిరేక బడ్జెట్ అంటూ ఎస్‌కేఎం మండిపాటు



బడ్జెట్ ప్రతులు దహనం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక బడ్జెట్ ప్రవేశ పెట్టిందని నిరసిస్తూ ఎస్‌కేఎం (సంయుక్త కిసాన్ మోర్చా) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చౌక్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే యం రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ మోడీ సర్కార్ కార్పొరేట్ వ్యక్తుల ఉడిగం చేస్తూ బడ్జెటు కేటాయించిందని అన్నారు. అన్నం పెడుతున్న రైతును తుంగలోకి తొక్కి రైతు పోరాటానికి ఇచ్చిన హామీలను విస్మరించి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా పంటలకు నామమాత్రం ధరలు పెంచి సంబరాలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. రైతును రాజు ను చేస్తాం అంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని చెత్తబుట్టలో పడేసి కార్పొరేట్ వ్యక్తులకు బడ్జెట్ కేటాయింపులు చేసిందని అందుకు ఈ రైతు వ్యతిరేక బడ్జెట్ కు నిరసనగా దేశవ్యాప్తంగా జాతీయ కమిటీ పిలుపు మేరకు బడ్జెట్ పత్రాలను దహనం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్‌రాములు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధంగా ఉందని మండిపడ్డారు. యూపీలో ఇప్పటికి అక్కడి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా మోడీ సర్కార్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనరు సురేష్, పి వెంకటేష్, వై రాజారెడ్డి, సాయ రెడ్డి, బొంబాయి గంగన్న, మరియు కార్మిక సంఘాల నాయకులు సాయ గౌడ్ , కిషన్ , గంగన్న, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లు పోలీసుల పేరుతో
ఫోన్ చేస్తే స్పందించొద్దు : సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సైబర్ నేరగాళ్లు పోలీస్ ఆఫీసర్ల పేర్లతో ఫోన్ చేస్తే ప్రజలు స్పందించకూడదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు పోలీసు ఆఫీసర్ల పేరిట బెదిరింపులకు పాల్పడుతున్నారని అందులో భాగంగానే కొత్త విధానానికి తెరలేపారన్నారు. సైబర్ మోసాలపై స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లు, సైబర్ క్రైమ్ నంబర్‌లు, డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక ప్రవేశాలు



ప్రేయర్ చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యధిక ప్రవేశాలు కల్పించామని ప్రధానోపాధ్యా యుడు వెంకటేశ్వర గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఉత్తమ బోధన, క్రమశిక్షణతో విద్యార్థుల సర్వ తోముకాభి వృద్ధికి కృషిచేస్తుం డటంతో ప్రవేశాలు పెరుగుతున్నట్టు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం మండలంలోని అనేక గ్రామాల నుంచి ఇప్పటి వరకు 230 విద్యార్థులు ప్రవేశం పొందారు. పాఠశాలలో మొత్తం 550 విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్, క్రీడల్లో కూడ ఉత్తమ ప్రతిభ చాటుతున్నట్టు తెలిపారు. ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో కృష్ణప్రసాద్ మండలంలో ప్రథమంగా నిలిచారని, డిజిటల్ విద్యాబోధన విద్యార్థులలో ఉత్తమ ఫలితాలు వస్తున్నట్టు తెలిపారు.

పంటపొలాల్లో
నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

నవతెలంగాణ-గాంధారి

పంటపొలాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వలన మొక్కజొన్న సాగు చేసే రైతులు వివిధ సమస్యలను తెగుళ్ళ, మురుగునీరు నిలుచుట, కత్తెర పురుగు ఆశించడానికి ఆస్కారం ఉండటం వలన వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మండలంలోని చద్మల్ తండా గ్రామాన్ని బుధవారం పర్యటించారు. మండల వ్యవసాయ అధికారి నరేష్ మాట్లాడుతూ.. ప్రధానంగా బ్యాక్టీరియా కాండం కుళ్ళు, తెగులు ఉద్రితి మొదలైనట్టు గుర్తించడమైనది. ఎడతెరిపిలేని ముసురు వానలు, నేలలో అధిక తేమా ఉన్న పరిస్థితులలో ఈ బ్యాక్టీరియా కాండం కుళ్ళ మరింత పెరిగే అవకాశం ఉన్నందున రైతులకు కొన్ని ముఖ్య



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సూచనలు చేశారు. తెగులు సోకిన మొక్క పైభాగం నుంచి వడలి పోయి ఆకుల అంచుల వెంబడి ఎండడం తర్వాత క్రింది ఆకులు కూడా పూర్తిగా ఎండిపోతాయి. కాండం గోధుమ రంగుగా మారి వేడినీళ్ళలో ఉడక బెట్టిన బెండులాగా తయారవుతుంది. కాండాన్ని చీల్చి చూసినప్పుడు కణుపు దగ్గరి కణజాలం మెత్తగా నీటిలో తడిచినట్లు కనిపించి కుళ్ళి, మురిగిన కోడిగుడ్డు వాసన వస్తుంది. కొన్ని సార్లు పీక లాగినప్పుడు మొక్క నుండి విడిపోయి బయటకు రావడంజరుగుతుందని దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పొలము నుంచి తీసి దూరంగా పారవేయాలని తెలిపారు. మురుగు నీటి కాలువలు ఏర్పరుచుకొని మొక్కజొన్నలో నీళ్ళు నిలబడకుండా తీసివేయాలి. 35శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరాకు 4-5 కిలోల చొప్పున సాళ్ళలో వెదజల్లాలి లేదా 4గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణంతో మొక్కల మొదల్ల చుట్టు తడుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నగేష్‌కుమార్, డాక్టర్ మల్లయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు వీరస్వామి, వ్యవసాయ అధికారి నరేష్, రైతులు శ్రావణ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు

సింగీతం రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత



ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసి దిగువకు నీటి విడుదల

నవతెలంగాణ-నిజాంసాగర్/నాగిరెడ్డిపేట్

మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సింగీతం రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకి రిజర్వాయర్ లోకి 4000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్టు జన వనరుల శాఖ అధికారి శివ తెలిపారు. ప్రస్తుతానికి సింగీతం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నదని రిజర్వాయర్ లోకి వస్తున్న వరదను 2000 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వెళ్లిపోగా.. 2000 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్టుతెలిపారు. సింగీతం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లుగా ప్రస్తుతానికి 416.550 మీటర్ల నీళ్లు నిలువ ఉన్నాయి.

నిజాంసాగర్‌కుతగ్గిన ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టినట్టు ప్రాజెక్టు ఏఈఈ శివ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీల కు గాను ప్రస్తుతం 3.855 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు.

14 అడుగులకు చేరిన పోచారం నీటిమట్టం

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం స్వల్పంగా పెరుగుతుంది. మంగళవారం ఎగువ ప్రాంతాలైన గాంధారి, లింగంపేట్ గ్రామాలలో భారీగా వర్షం కురవడంతో వరద నీరు పోచారం ప్రాజెక్టులోకి స్వల్పంగా చేరుతుంది. బుధవారం సాయంత్రానికి పోచారం ప్రాజెక్టులో 14 వాడు కూడా నీరు చేరినట్లు ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎస్సారెస్పీకి 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పోచంపాడ్‌లోని ఎస్సారెస్పికి బుధవారం 8 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. పూర్తిస్థాయి కెపాసిటీ 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1076.5 అడుగుల (36.269 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

జాతీయ రహదారి విస్తరణకు సహకరించాలి

- రైతులను కోరిన ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయ రహదారి 63 విస్తరణ కోసం భూ సేకరణ చేపట్టాల్సి ఉందని ఇందుకు రైతులు సహకరించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. సమావేశంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు పోతున్న రైతుల వివరాలను తెలియజేశారు. భూములు పోతున్న రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాతీయ రహదారి పై మూడు విస్తరణలో కమ్మర్ పల్లి గ్రామ పరిధిలో మొత్తం 140 మంది రైతులకు సంబంధించి సుమారు 60 ఎకరాల 8 గుంటల భూమి సేకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పెర్కిట్ నుండి మంచిర్యాల సెక్షన్ వరకు జాతీయ రహదారి 63 విస్తరణ జరుగుతుందన్నారు. జాతీయ రహదారి విస్తరిస్తున్న నేపథ్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం



మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

అవసరమైన భూ సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలన్నారు. నష్టపరిహారం విషయంలో కూడా ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు రూపంలో అందజేయాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. బైపాస్ రోడ్డు మార్గం డిజైన్ పూర్తయినందున భూ సేకరణ తప్పదన్నారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆర్డీవో స్వీకరించారు. రోడ్డు విస్తరణ కోసం నిర్ణయించిన మార్గంలో ఉన్న బోరు బావుల, పైప్ లైన్ల వివరాలను ఇప్పటికే సేకరించినట్లు ఆర్డీవో తెలిపారు.

సమావేశంలో పలువురు రైతుల అడిగిన సందేహాలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శరత్, సర్వేయర్ బాలక్రిష్ణ హరి, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ కష్టాలు

- విద్యార్థులకు మరో తలనొప్పిగా ఎన్‌ఎమ్ఎమ్ఎస్
- బ్యాంక్ టు స్కూల్ తిరుగుతున్న తల్లిదండ్రులు



నవతెలంగాణ-పర్ని

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో విద్య ను అభ్యసించే పేద విద్యార్థులకు మంచి విద్య, ఆహారం పొండటానికి స్కాలర్షిప్‌లను ప్రతి ఏటా ఆహ్వానిస్తుంది. ఇందులో ఒకటి ఎన్ఎమ్ఎమ్, ఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదివే 8 తరగతి ముగించుకొని 9వ తరగతి లోకి ప్రవేశించే విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కోసం విద్యార్థులు 8వ తరగతిలోనే అర్హత పరీక్ష రాస్తారు. ఇందులో పాస్ అయిన విద్యార్థులకు ఏడాదికి 12వేలు విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది.

పరీక్ష ఒకే.. ఆన్‌లైనే ఇబ్బంది..

విద్యార్థులు పాస్ అయిఎన తరువాత పాఠశాలలోని కంప్యూటర్ ఆపరేటర్‌కు విద్యార్థికి సంబంధిత కుల, ఆదాయం, బ్యాంక్ ఖాతా, పాన్ కార్డు (మైనర్) పత్రాలను వెబ్ సైట్ ఓపెన్ అవ్వగానే ఇవ్వాలి. లేని పక్షంలో విద్యార్థులకు స్కాలర్షిప్ రాదు. దీంతో పరీక్ష రాసి పాస్ అయిన విద్యార్థి తల్లిదండ్రులకు చదువు రాక పత్రాల కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రతి ఏటా కొత్త విద్యార్థుల తల్లిదండ్రుల పరిస్థితి ఇదే. విద్యార్థులకు బ్యాంక్ వారు కానీ, స్కూల్ వారు కానీ అనుకూల సమయం, సరియైన పక్కా సమాచారం ఇవ్వటంలో విఫలం అవుతున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ఏమి చెప్పాలో తెలియక పదే, పదే పత్రాల కోసం తిరుగుతు అలసిపోతున్నారు.

బ్యాంక్ ఖాతాతో ఆధార్ లింక్ కష్టాలు..

ఎన్ఎమ్ఎమ్ఎస్ఎస్ వెబ్‌సైట్ ఓపెన్ అయిదంటే చాలు సమయం లేదని పాఠశాలలో విద్యార్థులకు తెలుపగ, వారు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో పాఠశాలను సంప్రదిస్తారు. అటుగా మీ (అబ్బాయి) ది బ్యాంక్‌లో ఆధార్ లింక్ లేదు అందుకే వెబ్ సైట్ తీసుకొంటా లేదని తెలుపుతారు. మరుసటి రోజు బ్యాంక్‌కు వెళ్ళితే వారికి రుణ మాఫీ ఇతర పనులతో బిజీ బిజీగా ఉండి మీ పిల్లాడిది లింక్ ఉంది అంటారు. అటు స్కూల్‌కు ఫోన్ చేస్తే లింక్ లేదు బ్యాంక్ మేనేజర్‌ను గట్టిగ అడగండి అని సమాధానం. ఇలా వెబ్ సైట్‌లో విద్యార్థుల వివరాలు నమోదు అయేవరకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు నేషనల్ స్కాలర్షిప్‌తో తలనొప్పి గా మారింది. పరీక్ష ఎంత హాయిగా పాస్ అయినా ఈ వెబ్ సైట్‌తో మాత్రం నానా కష్టాలు తప్పటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్కాలర్షిప్ కు అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ విద్య అధికారులే సహకరిస్తే బాగుంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పట్టాలు అందేలా కృషిచేస్తా

- డబుల్ ఇండ్ల సముదాయాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

డబుల్ బెడ్ రూం పట్టాలు అందజేయాలని అందులో నివాసం ఉంటున్న లబ్దిదారులు కోరగా.. కలెక్టర్‌తో చర్చించి పట్టాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తెలిపారు. పట్టణంలో రాజీవ్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్‌లను కాలనీలో బుధవారం పర్యటించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో చేపట్టాల్సిన పనుల గురించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఉంటున్నా వారిని అడిగి తెలుసుకున్నారు. కాగా డబుల్ బెడ్ రూంల కాలనీ సమస్యలను పరిష్కారం చేసి మరోసారి వచ్చి పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ రోడ్డుకు మొరం వేసి, మురికి కాలువలు శుభ్రం చేయించారు. చెత్తను రోడ్డుపై వేయవద్దని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, జహీరా బేగం యామిన్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, తేజపు మానస ప్రసాద్, తయబా సుల్తానా సలీం, లడ్డు మొయినుద్దీన్, రవీందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సుధాకర్, మున్సిపల్, అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

సెక్రటరీని నియమించాలి


వినతి పత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్
మండలంలోని వేంపల్లి ప్రాథమిక సహకార సంఘంలో గత కొంతకాలంగా కార్యదర్శి లేకపోవడంతో బుధవారం సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్డీడీసీ బ్యాంకు సీఈవో, డీసీవో నిజామాబాద్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం క్లస్టర్ రైతులు ఫర్టిలైజర్ విషయంలో ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. వెంటనే సొసైటీకి సెక్రటరీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బద్దం నర్సారెడ్డి, డైరెక్టర్లు మాల్కన్న, శ్రీనివాస్, ఏలేటి రాములు, నేర బాబూరావు తదితరులు పాల్గొన్నారు..

క్యూఆర్ కోడ్‌పైన అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈ బాబా శ్రీనివాస్

నవతెలంగాణ-మోపాల్
విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కంజర్, మోపాల్, సిర్పూర్ తదితర గ్రామాలలో వినియోగదారులందరూ తమ విద్యుత్ బిల్లును చెల్లించడం కొరకు క్యూఆర్ కోడ్‌ను ఎలా ఉపయోగించాలనే దానిపైన ఎలక్ట్రిసిటీ ఏఈ బాబా శ్రీనివాస్ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేశామని గ్రామంలోని ప్రజలందరూ దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, విద్యుత్ సిబ్బంది, పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- కార్యాలయం ముందు బైఠాయించిన అమీర్ నగర్ గ్రామస్తులు
- ఎస్ఐ బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామస్తుల ఆరోపణ


ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని అమీర్ నగర్ గ్రామ పరిధిలో గల సర్వేనెంబర్ 73లో అక్రమ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ అమీర్ నగర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున తహసిల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇంటికొకరు చొప్పున తరలివచ్చిన గ్రామస్తులు తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి బైఠాయించారు. పలు ట్రాక్టర్లలో మహిళలు కూడా పెద్ద ఎత్తున తహసిల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. గ్రామ పరిధిలోని పోరంబోకు భూమి సర్వే నంబర్ 73లో చౌట్‌పల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వాటిని రద్దు చేయాలని నినాదాలు చేశారు. అక్రమ పట్టాలు చేసుకున్న వ్యక్తులు అట్టి భూముల్లో పంట సాగు పనులు చేస్తున్నారని వెంటనే అధికారులు జోక్యం చేసుకోని పనులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ విషయమే గతంలో రెండు మూడు సార్లు వినతి పత్రాలు కూడా అందజేసినట్లు తెలిపారు. తక్షణమే అధికారులు సర్వే నిర్వహించి అక్రమ పట్టాలను రద్దు చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఇక్కడ నుండి కదలబోమని గ్రామస్తులు భీష్మించారు. ఈ విషయమై కమ్మర్‌పల్లి ఎస్ఐకి ఫోన్ చేస్తే ఆ భూముల జోలికి వెళ్తే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. ఆ భూముల జోలికి గ్రామస్తులు ఎవరు వెళ్లొద్దని అంటున్నాడని తెలిపారు. గ్రామస్తులు ఆందోళన చేస్తున్న సమయంలోనే తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో రాజాగౌడ్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన కొందరు గ్రామస్తులను తహసిల్దార్ కార్యాలయంలోకి పిలిపించి మాట్లాడారు. భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తున్నందున సమస్య పరిష్కారానికి కోర్టుకే వెళ్లాలని ఆర్డీవో గ్రామస్తులకు సూచించారు. ఆక్రమించుకున్న భూమిలో గ్రామస్తులు కొందరికి పట్టాలు ఉన్నాయని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా మూడు నాలుగు రోజుల తర్వాత తహసిల్దార్‌తో రికార్డులు పరిశీలింపజేసి పట్టాలు ఉన్నది లేనిది తెలుస్తామన్నారు. అప్పటివరకు వేచి ఉండాలని అమీర్ నగర్ గ్రామస్తులకు ఆర్డీవో సూచించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించి తిరిగి వెళ్ళిపోయారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సిఐ

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేనియెడల చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని బోధన్ ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్ తెలిపారు బుధవారం ఆయన రైల్వే గేట్ వద్ద విధి నిర్వహణలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, వారికి వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అలాగే ఆగస్టు 15వ తేదీ నుండి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లేని ఎడల చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బుధవారం వాహన తనిఖీల్లో త్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మైనర్లు వాహనాలు నడపడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపించిన ఘటనలో 22 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యానికి బానిసై యువకుని ఆత్మహత్య


చిన్నసాయిలు మృతదేహం

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని కుర్నాపల్లి గ్రామానికి చెందిన వడ్డెర చిన్న సాయిలు(36) యువకుడు మద్యానికి బానిసై తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడినట్టు మృతుని తల్లి మామిడి పోసాని, కుటుంబీకులు తెలిపారు. చిన్న కుమారుడైన చిన్న సాయిలు మద్యానికి బానిసకావడంతోపాటు అప్పులు చేసి ఆయన భార్యతో గొడవ పడడంతో ఆరు సంవత్సరాల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. భార్య వెళ్ళినప్పటి నుంచి చిన్న సాయిలు ఒక్కడే ఉంటున్నట్లు తల్లి తెలిపారు. అప్పులు కావడం, భార్య కాపురానికి రాకపోవడం వల్ల మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తల్లి మామిడి పోసాని ఎడపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్లకు సన్మానం


మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌లను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజులను నూతన రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మున్సిపాలిటీకి ఉపయోగపడే విధంగా తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు రజనీష్, కార్యదర్శి ఆనంద్, లింబాద్రి గౌడ్, పుష్కర్ రావు, చాలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం




నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని జమలంకు చెందిన ఓ యువతి అదృశ్యం మైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జమలం గ్రామానికి చెందిన శిరీష(35) ఈ నెల 27న నిజామాబాద్ వెళ్లి తిరిగి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమె భర్త మత్యారి సాయిలు అదేరోజు నిజామాబాద్ వెళ్లి తిరిగి రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చేసరికి తన భార్య లేదని తెలిసింది. వెంటనే బంధువులకు ఫోన్ చేయగా అక్కడికి రాలేదని తెలియడంతో వెతికిన ఆచూకి లభించలేదు. భర్త మత్యారి సాయిలు ఎడపల్లి పోలీసులకు దరఖాస్తు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆచూకీ లభిస్తే ఎడపల్లి పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

నవతెలంగాణ-ముప్కాల్
మండలంలోని నల్లూర్ గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీవో మహమ్మద్ గౌస్ బుధవారం పర్యవేక్షించారు. అందులో భాగంగా పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠ ధ్వామం తదితర ప్రాంతాలను పరిశీలించారు. పంచాయతీ రిజిష్టర్ లను సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నమన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ సెక్రటరీకి సూచించారు. ఆయన వెంట నల్లూర్ పంచాయతీ సెక్రటరీ విజ్ఞేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమ ఇసుక డంప్ స్వాధీనం


మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది

నవతెలంగాణ-పోతంగల్
మండలంలోని పోతంగల్, హంగర్గా ఫారం వద్ద ఇసుక డంప్‌లను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులు సమాచారం ఇవ్వగా పోతంగల్ గ్రామంలో మూడు చోట్ల 6 ట్రాక్టర్ ట్రిప్పులు, హంగర్గా ఫారం రోడ్డు పక్కన ఎనిమిది ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకడంపులను రెవెన్యూ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ సహాయకులు స్వాధీనం చేసుకున్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-భీంగల్
పట్టణ కేంద్రంలోని బోయి గల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన నాగరాజు బదిలీపై వెళ్లగా బుధవారం ప్రధాన ఉపాధ్యాయుడు సత్య రమేష్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ స్వామి నాగరాజును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, లింబాద్రి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది ఒక్కటే బస్సు.. కిక్కిరిసిన ప్రయాణికులు



నవతెలంగాణ-బోధన్
బోధన్ మండలంలోని పెద్ద మామంది, చిన్న మామంది మీదుగా కొప్పర్గా, హంగర్గా గ్రామాలకు వెళ్లే బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి పోతుంది. ఉదయం, సాయంత్రం రెండు పుటలు మాత్రమే ఈ గ్రామాలకు వెళ్లె బస్సులో ప్రయాణికులతోపాటు విద్యార్థులు కళాశాలలకు, హైస్కూళ్లకు బోధన్ వెళ్లడానికి ఈ బస్సులోనే ఎక్కడంతో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. దాంతో విద్యార్థులు బస్సు ఫుట్ బోర్డుపై వేలాడుతూ ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడింది. కావున ఆర్టీసీ అధికారులు ఉదయం, సాయంత్రం రెండు బస్సులు నడిపించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ప్రయాణికుల రద్దీ పరిశీలించడానికి త్వరలో కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తామని అన్నారు. దాని తర్వాతనే ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సు వేయడానికి ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు.

బాధితునికి రూ.25వేల నష్టపరిహారం అందిచండి

- జడ్జీ తీర్పు

నవతెలంగాణ-బోధన్
దాడి ఘటనలో గాయపడినవ్యక్తికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని ఆదేశిస్తూ బుధవారం బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గత యేడాది నవంబరులో సాత్విక్, సిద్దు, లోకేష్, కార్తిక్, రమేష్ ఘర్షణ పడుతుండగా ఎర్రోళ్ల యాదవరాజు అనే వ్యక్తి వారిని విడిపించడానికి ప్రయత్నించాడు. దాంతో రమేష్ అనే వ్యక్తి ఈ ఘటనను మనసులో పెట్టుకుని యాదవరావుపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో యాదవరాజు తీవ్రగా గాయపడ్డారు. ఆయన్ను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై బాధితుని భార్య ఎర్రోళ్ల సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటగిరి ఎస్సై కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జిషీటు ధాఖలు చేశారు. పోలీసు సాక్షుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పి. సమ్మయ్య, వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన అనంతరం బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ దేవన్ అజయ్ కుమార్. తీర్పును వెల్లడించారు. సదరు వ్యక్తిని గాయపరిచినందుకు బాధితునికి రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. ఒకవేళ జరిమాన చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు జీవితం అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో సబ్ ఇన్స్పెక్టర్ సందీప్, రుద్రూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జాయిష్ రెడ్డి, ఏసీపీ కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్
రైతు రుణమాఫీ రూ.లక్ష యాభై వేల రూపాయలలోపు నేరుగా రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ టౌన్ ఇంచార్జ్ ముస్కు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో లబ్ధిదారులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలేటి రాములు, కొమ్ముల శ్రీనివాస్, ముస్కు మహేందర్, ప్రశాంత్, మల్లారెడ్డి, కట్ట గోపి, సదా, గద్దల గంగాధర్, లాలయ్య లబ్ధిదారులు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


ప్రగతిశీల నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-మోపాల్
మండల కేంద్రంలో ప్రగతిశీల రాష్ట్ర నాయకుడు బండి మద నర్సయ్యను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం నిరుద్యోగ సమస్యలపై పిడిఎస్‌యు, పివైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడంతో ముందస్తు నోటీసులు ఇచ్చి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని రేవంత్ రెడ్డి సర్కార్‌కి ఇది సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు

కాలువలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్
నగరంలోని నాల్గవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి కాలులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గాయత్రి నగర్‌కు చెందిన సాయికుమార్(21) వృతి రీత్యా లేబర్ పనులు చేసుకుంటారు. నగర శివారులోని బోర్గాం వద్ద ఉన్న కల్లు దుకాణంలో మద్యం సేవించి మత్తులో పక్కనే ఉన్న కాలువలో జారి పడి మృతి చెందినట్టు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాధు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గురువుకు ఘన వీడ్కోలు


చప్పట్లు కొడుతూ గురువుకు వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేసే ఉద్యోగ విరమణ పొందిన సాయిగౌడ్ ను బుధవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు దారి పొడవున చప్పట్లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సాయిగౌడ్ మాట్లాడుతూ తనను అన్ని విధాలుగా సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా తెలుసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు నగేష్ బాబు, సుధాకర్ రెడ్డి, వెంకట్ ,రాచప్ప, కృష్ణ, రామ్మోహన్,ఖైరాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ వితరణ

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతే గ్రామానికి 235 జతల షు వితరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఇసపెల్లి రవి, కమ్మర్‌పెల్లి మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల కోసం అడగగానే షూ వితరణ చేస్తానని ఒప్పుకున్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ దోళ్ళ రాజేశ్వర్, మేనేజర్ మిత్ర బృందం చేతులమీదుగా విద్యార్థులకు అందజేసినట్టు ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రత్నయ్య, శ్రావణ శ్రీ, కవిత, పిడి మంచిర్యాల సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-మోపాల్
బోర్గాం(పి) లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాంచారి ఉషారాణి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నాంచారి నితిన్ దాదాపు రూ.40వేలు విలువైన నోట్‌బుక్స్‌ను అందించినట్లు ప్రధానోపాధ్యాయులు శంకర్ బుధవారం తెలిపారు. అలాగే ఈ ప్రోత్సాహకానికి తోడ్పాటు అందించిన తమ పాఠశాల హిందీ అధ్యాపకురాలు ఉషారాణికి ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నంచారి లక్ష్మన్, మురళీధర్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని జైతాపూర్ ప్రాథామిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో సుమారు 50మంది బాల, బాలికలకు రాత పుస్తకాలను లయన్స్ క్లాబ్ ఆఫ్ ప్రతినిధులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా ఆర్గనైజర్ కరటూరి సూర్యనారాయణ, లయన్స్ క్లబ్ మండల అధ్యక్షులు మనోజ్ కుమార్, క్లబ్ ప్రతి నిధులు గంగారెడ్డి, కదం ప్రకాష్ రావు, మెర్సీ, పుష్పలత, రాణి, మాధవి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేయాలి

- సిడిపిఓ జానకి

నవతెలంగాణ-బోధన్
ఆగస్టు 1 నుంచి 7 వరకు బోధన్ డివిజన్లోని అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాలలో గర్భిణీ, బాలింతలు పాల్గొని విజయవంతం చేయాలని ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో శిశువులకు అందించే తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. కావున అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింత స్త్రీలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమే సూచించారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

డ్రగ్స్ వినియోగంతో నేరాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత ప్రభుత్వ ఆదేశాలనుసారం విద్యార్థులతో మత్తు పదార్థాల వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు కే.రాజన్న బుధవారం తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్తు చిన్నాభిన్నమవుతుందని, వాటికి దూరంగా ఉండి ఉజ్వలమైన భవిష్యత్తును కాపాడుకోవాలని ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల సమాజంలో నేరాల సంఖ్య పెరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో డ్రగ్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరిమల్లె దేవన్న, కిషన్‌గౌడ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యూ, పివైఎల్ విద్యార్థి నాయకుల అరెస్టు

- అసెంబ్లీ ముట్టడి సందర్భంగా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
చలో అసెంబ్లీ ముట్టడిలో నిజామాబాద్ పిడిఎస్‌యూ, పివైఎల్ విద్యార్థి సంఘాల నాయకులను బుధవారం అరెస్టు చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య రంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పిడిఎస్యు, పివైఎల్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడించిన నిజామాబాద్ పిడిఎస్‌యూ, పివై ఎల్ నాయకులు జన్నారపు రాజేశ్వర్, వనమాల సత్యం, కార్తీక్, ప్రిన్స్, భాస్కర్, రవీందర్, సాయినాథ్, రవీందర్, అక్షయ్‌లను అసెంబ్లి వద్ద అరెస్టు చేసి షా ఇనాయత్ గంజ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అసెంబ్లి ముట్టడిలో వందలాది మంది పిడిఎస్యు, పివైఎల్ నాయకులను అరెస్టు చేశారు.

విద్యార్థులకు బస్సు పాసుల అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా బస్సు పాసులను అందజేశారు. బుధవారం మండల కేంద్రం శివారులోని మోర్తాడ్ రోడ్డులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ కాలనీ, గాంధీనగర్ నుంచి వచ్చే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ డిపో నుంచి విద్యార్థులకు బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సాయన్న మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం అందించే బస్సు పాసులను సద్వినియోగం చేసుకొని ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ధర్పల్లి
మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామానికి చెందిన దుమాల కవిత (43) బుధవారం మధ్యాహ్నం ఊర చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మృతురాలికి గత కొన్ని రోజుల నుండి మతిస్థిమితం లేదు. ఈమధ్య ఆరోగ్యం బాగాలేక ఇబ్బందులు పడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈఆఘుయిత్యానికి పాల్పడిందని మృతురాలి భర్త దుమాల లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బస్తీ దవఖాన నూతన భవనానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో బస్తీ దావకాన నూతన భవనానికి భూమి పూజను బుధవారం గ్రామస్తులతో కలిసి పంచాయతీ కార్యదర్శి నరేష్ ప్రారంభించారు. బస్తీ దవఖాన ఏర్పాటుతో పేద ప్రజలకు వైద్యం మరింత దగ్గరవుతుందని అభిప్రాయపడ్డారు. నూతన భవనాన్ని నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు గర్గుల్ రాజా గౌడ్, గ్రామస్తులు నాయిని నర్సింలు, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

- మండల ప్రత్యేకాధికారి లక్ష్మి ప్రసన్న

నవతెలంగాణ-పిట్లం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారిని లక్ష్మీ ప్రసన్న అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలంలోని గద్దె గుండు తండా కమ్యూనిటీ ప్లాంటేషన్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యానికి మొక్కలు దోహదపడతాయన్నారు. మానవ మనుగడకు మొక్కలే కీలకము కాబట్టి ప్రతి ఒక్కరూ మొక్కలపై మక్కువ పెంచి తమ తమ ఇంటి , పంట చేనులలో మొక్కలు నాటాలని సూచించారు. కాగా మండల పంచాయతీ అధికారి యాదగిరి కేజీబీవీ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న పనులను పరిశీలించి త్వరలో పూర్తిచేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ సరితకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శివ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత

- మూడు కిలోమీటర్ రోడ్డు పనులు 15 నెలలైనా పూర్తికాలే
- ఏడు నెలల క్రితం కంకర వేసి వదిలివేత
- మూడు నెలల్లో ఇద్దరి ప్రాణాలు బలిగొన్న కంకర రోడ్డు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతల మయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పెద్దపూతంగల్ గ్రామ స్టేజి నుండి మేడిపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించారు. సుమారు 14 కోట్ల రూపాయలను మంజూరు అయ్యాయి. మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లు పనులు అప్పగించింది. విస్తరణ పనులు చేపట్టారు. అయితే గత 15 నెలలుగా మూడు కిలోమీటర్ల పనులు కొనసాగుతూనే ఉండటం గమనార్హం. గతేడాది జూన్‌లో ప్రారంభమైన పనులు ఈ సంవత్సరం ఆగస్టు నెల వచ్చినా ఇప్పటికీ పనులు పూర్తికాలేవు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో కానీ గత 15 నెలలుగా ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.

కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశాడు. గత 7 నెలలుగా ఎలాంటి పనులు కొనసాగడం లేదు. కంకర వేసి వదిలేయడంతో ఆ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తరచూ ప్రమాదాల గురవుతున్నారు. ఈ మధ్యకాలంలో వాహనాలు అదుపుతప్పి ఇద్దరు మృతి చెందారు. అయినా కాంట్రాక్టర్ కానీ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ ఏమీ పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కంకర వేసి వదిలేయడంతో ఆ మూడు కిలోమీటర్ల ప్రయాణంలో ఎండాకాలం దుమ్ముతో వర్షాకాలం బురద మరియు అడుగు అడుగుకో గుంత ఏర్పడటంతో గాంధారి బాన్స్‌వాడ ప్రధాన రహదారి వెంట ప్రయాణం ప్రయాణికులు నరకం చూస్తున్నామని ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లడంతో వెనుక వెళ్లే వారికి బురదతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కానీ అధికారులు కానీ స్పందించి గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు ఇంకెన్నాళ్లు చేస్తారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పెద్ద పోతంగల్ గేట్ నుండి మేడిపల్లి వరకు రోడ్డు గల గాంధారి బాన్సువాడ ప్రధాన రోడ్డు మూడు కిలోమీటర్లు. దీని గుండా ప్రయాణం చేసేందుకు మూడు కిలోమీర్లకే సుమారు 20 నిమిషాలు పడుతుంది అంటే రోడ్డు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గోపాల్ చర్మల్ తండా



గత 15 నెలల క్రింద ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎండాకాలం దుమ్ముతో వర్షాకాలం బురద, గుంతలు ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పూర్తి చేయాలి.

నామాల భూమయ్య తిప్పారం

సమయపాలన లేని బస్సులు

- గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు



బస్సుకోసం గంటల తరబడి వేచి చూస్తున్న ప్రయాణికులు

నవతెలంగాణ-మద్నూర్

ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో మద్నూర్ మండల కేంద్రం ఉంటుంది. ఇక్కడి నుంచి నుండి ప్రయాణికులు మూడు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మద్నూర్ పాత బస్టాండ్‌లో బుధవారం నాడు ప్రయాణికులతో బస్టాండ్ అంతా కిటకిటలాడింది. ప్రయాణికులు ఎక్కువ బస్సులు తక్కువ సమయపాలన లేని బస్సు సర్వీసులు, బస్సుల కోసం ఈ ప్రాంత ప్రజలు గంటల తరబడి ఎదురు చూడవలసిన దుస్థితి కనిపిస్తుంది. వాటి గురించి పలుమార్లు పత్రికల్లో ప్రయాణికులు ఇబ్బందుల గురించి ప్రచురించినప్పటికీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సర్వీస్ అధికారులు సమయపాలనతో బస్సులు నడిపించడం లేదని ఆరోపణలు ప్రయాణికుల్లో వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 9 గంటల నుండి 10:30 గంటల వరకు ఈ మధ్యలో బస్సు సర్వీస్ లేక బుధవారం నాడు ప్రయాణికులంతా గంటన్నర సేపు బస్సు కోసం ఎదురు చూశారు. బస్సులు గంటల తరబడి రాలేకపోవడాన్ని చూసి పలువురు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని ఒక వైపు ఆర్టీసీ అధికారులు ప్రచారం చేస్తూ.. మరో వైపు సకాలంలో బస్సులు పంపడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రం నుండి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి కామారెడ్డి జిల్లా కేంద్రానికి ఉదయం పూట మబ్బున ఐదు గంటల నుండి ఉదయం ఎనిమిది గంటల మధ్య ఏ ఒక్క బస్సు సర్వీసు లేకపోవడం జిల్లా కేంద్రాలకు వెళ్ళవలసిన ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఉదయం 6 గంటలకు గానీ ఏడు గంటలకు గానీ బస్సు సర్వీసు తప్పకుండా వేయాలని ఇక్కడి ప్రయాణికులు రోడ్డు రవాణా సంస్థ అధికారులకు కోరుతున్నారు.

ప్రజల ప్రాణాల రక్షణకు చర్యలు చేపట్టండి

నవతెలంగాణ-భిక్కనూర్



గాయపడ్డ మహిళ

ప్రజల ప్రాణాల రక్షణ కోసం గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలలో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు, దోమల బెడద విపరీతంగా పెరిగిపోయినట్టు తెలిపారు. ఉదయం సమయంలో బయటకు వెళ్లాలంటే కుక్కలు, కోతులు ఎక్కడ దాడి చేస్తాయో అని భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందని, రాత్రి సమయంలో విపరీతంగా వ్యాపిస్తున్న దోమల కారణంగా విష జ్వరాల బారిన గురవ్వాల్సి వస్తుందన్న భయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రామేశ్వర్‌పల్లి గ్రామంలో 8 మందిపై కుక్క దాడి చేయగా, సోమవారం భిక్కనూర్ పట్టణంలో మహిళలపై కోతులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఒకవైపు కోతులు, మరోవైపు కుక్కలు, దోమల కారణంగా ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా జీవించాల్సి వస్తుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోతులు, కుక్కలు, దోమల బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కంటి సమస్యలు నిర్లక్ష్యం చేయవద్దు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

కంటి సమస్యలతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయవద్దని కంటి వైద్య నిపుణులు రవీందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి సమస్యతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు అందజేశారు. ప్రతి బుధవారం ఆరోగ్య కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు కంటి వైద్య పరీక్షలు చేసుకొని వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని తెలిపారు.

రెట్టింపైన సాగు పెట్టుబడి వ్యయం

- కాడెడ్లు కనుమరుగు
- యంత్రాలతో దుక్కిదున్నకాలు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

వ్యవసాయమే ప్రధాన జీవనాధరమైన రైతులకు ఏటా పెట్టుబడి వ్యయం పెరిగి వారికి సాగు ఖర్చులు భారమవుతున్నాయి. సాగు పనుల్లో రైతులకు ఆసరా నిలిచే కాడేడ్లు కనుమరుగైయ్యాయి. యంత్రాల, ట్రాక్టర్ల వాడకం పెరిగిపోవడం, ఇంధనాలైన డీజిల్, పెట్రోల్ రేట్లు అధికంగా పెరగడంతో పంటల సాగుకు భారంగా మారుతోంది. ట్రాక్టర్ యజమానులు గంటకు రూ.1200 నుంచి రూ.1500 వరకు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్థిక భారమైన వ్యవసాయ పనులు చేయిస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

భారంగా పశుపోషణ..

పశుపోషణ భారంగా మారడంతో రోజురోజుకూ వ్యవసాయంలో కాడెద్దుల వినియోగం తగ్గుతుంది. ఒకప్పుడు ప్రతి గ్రామంలో అధికశాతం కుటుంబాల్లో కాడెద్దులు ఉండగా వాటితో పనులు చేయించేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో పనులు చేపట్టేందుకు కాడెద్దులు కనిపించడం లేదు. అలాగే రైతులు పశువులను పెంచడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. ఏ గ్రామంలో చూసిన ట్రాక్టర్ల వినియోగం పెరిగింది.

పెరిగిన యంత్రాల వాడకం..

వ్యవసాయ పనులను కూలీలపై ఆధారపడకుండా ట్రాక్టర్ల ద్వారా చేపడుతున్నారు. పత్తి కర్రలను తొలగించడానికి ఎకరాకు రూ.800 నుంచి రూ.1000, దుక్కి దున్నడానికి ఎకరాకు రూ.1200 నుంచి రూ.1500 చెల్లించాల్సి వస్తుంది. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ ఎకరాకు రూ.1200 నుంచి రూ.1400 వరకు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో ఒక్కసారి ట్రాక్టర్లకు డిమాండ్ పెరగడంతో కాడెడ్లు కనుమరుగైయ్యాయి. దీంతో రైతులపై సాగు భారం పడింది.

స్వీపర్‌కు యూత్ ఫర్ యూనిటీ చేయూత



సహాయం చేస్తున్న యూత్ ఫర్ యూనిటీ సభ్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా స్వీపర్ గా విధులు నిర్వహిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన యూసుఫ్.. తన కూతురు వివాహానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని తమ వంతు సహాయంగా యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో 9000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని యూసుఫ్‌కు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యూనిటీ విభాగం సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో బోనాల పండగ



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయాలను అనుసరిస్తూ పండుగలో పోతరాజు, అమ్మవార్ల వేషధారణలో నృత్యాలు చేసి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు చదువుతోపాటు తెలంగాణ, భారతదేశ సాంప్రదాయాలు తెలుసుకోవడం ప్రాముఖ్యమన్నారు. కార్యక్రమానికి సహకరించిన విద్యార్థులకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



విద్యార్థులకు టై, బెల్టు అందజేత

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని బోయిగల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు సత్య రమేష్ కుమార్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు వితరణగా అందజేశారు. ఇట్టి టై, బెల్టులను మండల విద్యాధికారి స్వామి చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సేవ చేయాలనే తపన ప్రతి వ్యక్తి కలిగి ఉండాలని తెలియజేశారు. విద్యార్థులకు సేవ చేయాలనే దాతృత్వ స్వభావం కలిగి ఉండడం గొప్ప విషయమని సత్య రమేష్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, లింబాద్రి, మహేష్ ఏపీసీ చైర్మన్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

- పట్టుపడ్డ వారి ఆస్తులు జప్తు చేస్తాం : ఎస్ఐ మహేందర్

నవతెలంగాణ-పెద్దకొడపగల్

మండలంలోని పోచారం తండా ప్రజలకు గంజాయి అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ తండాలో అక్రమ గంజాయి రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. తండా యువకులు చెడు మార్గంలో వెళ్లకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఎవరైనా తండాలో గంజాయి అమ్మినా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకొని కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే తండాకు ఏ అధికారులు వచ్చినా వారి విధులకు ఆటంకాలు కల్పించి భయభ్రాంతులకు గురి చేస్తారని తమకు సమాచారం ఉందని ప్రభుత్వ అధికారుల విధులకు సహాయ సహకారాలు అందించి తోడ్పడాలని అన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటే మాత్రం కఠిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత వారం క్రితం గంజాయి విక్రయిస్తుండగా ఒకరిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని మరో ఇద్దరు తాండయువకులు పరారీలో ఉన్నారని వారికి తాండ పెద్దలువారి తల్లిదండ్రులతో మాట్లాడి పోలీసులకు అప్పగించాలని సూచించారు. లేని యెడల వారిని ఎలా పట్టుకురావలో తమకు తెలుసని స్పష్టం చేశారు.

అంతేకాకుండా జిల్లాలోనే గంజాయి స్మగ్లింగ్ అనే పేరు మీ తండాకు చెడ్డ పేరు వచ్చిందని అన్నారు. కొందరి వల్ల పోచారం తండా పేరును జిల్లాలోనే వినబడటం మంచి పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైన తాండ పెద్దలు యువకులను చెడు మార్గంలో వెళ్లకుండా అరికట్టేందుకు పోలీసు వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఒక వేళ గంజాయితో పాటు మత్తు పదార్థాలు అమ్మిన కొన్న వారి పై కేసులు నమోదు చేసి వారి ఆస్తులను జప్తు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేందర్, సిబ్బందిలు సాయి శివ, శ్రీనివాస్, అంజి, సంజీవ్ రెడ్డి, మాజీ సర్పంచ్, తండా పెద్దలు యువకులు పాల్గొన్నారు.



తండావాసులతో మాట్లాడుతున్న పోలీసులు

మండలంలో 50.8 సెంమీ భారీ వర్షం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో, తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు వర్షానికి పూర్తిగా కొట్టుక పోవడంతో కామారెడ్డికి వెళ్ళ రహదారి పూర్తిగా బంద్ కావడంతో మండలంతో పాటు వివిధ మండలాల ప్రజలు వివిధ మార్గాల నుండి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. మండలంలో 5.08 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. కన్నాపూర్ వద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహించింది. గంగమ్మవాగు వద్ద ప్రయాణికులకు తాత్కాలిక రోడ్డును నిర్మించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. వివిధ మార్గాల ద్వారా జిల్లా కేంద్రానికి వెళ్ళటానికి 5 నుండి 10 కి.మీ ఎక్కువ ప్రయాణించవలసి వస్తుందని, సమయము, డబ్బులు వృధా అవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

పదవి విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి

- జడ్పీ సీఈఓ చందర్ నాయక్



పదవి విరమణ పొందిన ఎంపీడీవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఉద్యోగ విరమణ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తప్పనిసరి అని జెడ్పి సీఈఓ చంద్రనాయక్ అన్నారు. బుధవారం నాగిరెడ్డిపేట్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన పర్బన్న పదవి విరమణ పొందారు. పదవి విరమణక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పి సీఈవో చందర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమతమ విధులను సక్రమంగా నిర్వర్తించి పనిచేసిన ప్రతిచోట తమకు గుర్తింపు వచ్చే విధంగా పని చేస్తారని ఆయన అన్నారు. నాగిరెడ్డిపేట మండలానికి ఆయన సేవలు గుర్తిండిపోయేలా అందించారని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డిఎల్పిఓ సురేందర్, ఎంఈఓ వెంకటేశం, మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాజు దస్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దయ్య, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులతో కిటకిటలాడిన బ్యాంక్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ రైతులతో కిటకిటలాడింది. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలో బాగంగా రైతులకు రుణ మాఫీ చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడంతో బుధవారం బ్యాంక్ రైతులతో కిట కిటలాడింది. రెండవ దఫాలో ఒక లక్ష యాభై వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బ్యాంకులో వివరాలు అడుగుతున్న రైతులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

ఎమ్మార్వోను మర్యాదపూర్వకంగా కలిసిన రేషన్ డీలర్లు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని రేషన్ డీలర్లు బుధవారం నూతన ఎమ్మార్వో శ్రీలతను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ప్రజలకు అందించే రేషన్ సరుకుల గురించి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆమెకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు మీనా నరేష్, చంద్రకళ, రమారాణి అశోక్, మనస్విని, రహమాన్, శ్రీనివాస్, గంగాధర్, గంగాశంకర్, అరుణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎమ్మార్వోను సన్మానించిన రేషన్ డీలర్లు

ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద పోలీసుల అధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎస్సై, ఏఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దుషించ కూడదని, కులం పేరుతో దూషించకపోయిన దూషించారని కేసు నమోదు చేస్తే అధరాలను చూపించాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సయ్య సిబ్బంది, గ్రామస్థులు లక్ష్మీనారాయణ, నర్సాగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సెయింట్ జేవియర్స్‌లో విద్యార్థులకు ప్రతినిధుల ఎన్నికలు

- ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న విద్యార్థి నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సెయింట్ జేవియర్స్ పాఠశాలలో పాఠశాల విదార్థులకు ప్రతినిధుల ఎన్నికలు, ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించామని, పాఠశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం, విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే పాఠశాలలో విదార్థులకు ప్రతినిధుల ఎన్నికలు ఎంతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించామని పాఠశాల చైర్మన్ పాకాల నర్సింహారావు, ప్రిన్సిపాల్ లత గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు పాఠశాల పీపుల్ లీడర్‌గా యెల్. అంజన, పాఠశాల అసిస్టెంట్ పీపుల్ లీడర్‌గా బి. శృతిక, పాఠశాల గేమ్స్ లీడర్‌గా బి.హిమన్ష్, పాఠశాల కల్చరల్ లీడర్ సి. హెచ్ మనోజ్ఞ, పాఠశాల గ్రూప్ లీడర్స్ రెడ్ వారియర్స్ జె. జాన్వి, పింక్ పాంథర్స్ ఆర్. మనస్విత, గ్రీన్ గెంట్స్ టి.సంజన, యేల్లో లయన్స్ ఎస్ లలిత, ఈవిధంగా విద్యార్థుల్లో ఇప్పటినుండే మన భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించారు. నాయకత్వ లక్షణాలను తెలియజేయడమే లక్ష్యమని, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యం అని అన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శైలజ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి మండల డిప్యూటీ తాహసిల్దార్ గా శైలజ బాధ్యతలను స్వీకరించారు ఇంతకుముందు నిజామాబాద్ లోని కలెక్టరేట్లో విధులు నిర్వహించి బదిలీపై ఇందల్వాయి డిప్యూటీ తహసిల్దార్గా వచ్చినట్లు తాహసిల్దార్ వెంకట్రావు బుధవారం తెలిపారు. గత కొన్ని నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో మండల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, డిప్యూటీ తహసీల్దార్ రావడంతో ఇబ్బందులు తప్పినట్లు పలువురు పేర్కొన్నారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అబ్బా చిరంజీవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అకౌంట్ అండ్ ట్యాక్స్ ఫెర్, చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్, హాస్పిటల్ మేనేజ్ మెంట్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, ఫార్మసీ అసిస్టెంట్ తదితర కోర్సులలో అందుబాటులో ఉన్నాయని కనుక ఆసక్తిగల యువకులు 79893 36007 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

శిథిలావస్థలోనున్న అదనపు గదులు తొలగింపు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాల లో పాడుబడిన శిథిలావస్థలో ఉన్న రెండు అదనపు గదులను తొలగించడం జరిగిందని గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు పేర్కొన్నారు. ఇటీవల రెంజల్ మండలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఈ భవనాన్ని చూసి తొలగించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. తమేరకు బుధవారం ఆ గదులను కూల్చివేసినట్లు తెలిపారు. చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తొలగించిన మట్టిని సైతం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గుంతలను పూడ్చేందుకు అక్కడికి తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అన్ని గ్రామ దేవతల వద్ద హలాల్‌ను నిషేధిస్తూ సర్వ సమాజ్ ఐక్య కార్యాచరణ కమిటీ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా హిందూ వాహిని గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శివాజీ చౌక్ వద్దగల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నందు సర్వసమాజ్ అధ్యక్షులైన ఆకుల రాజును శాలువా, పూలదండతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హిందూ వాహిని నాయకులు బొట్ల విజయ్, ఆకుల శ్రీనివాస్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, జెస్సు అనిల్ కుమార్, రవినాథ్ సార్, తేలు ఒడ్డెన్న, రుద్ర రవి, చేపూర్ ధనుంజయ్, గడ్డం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- దుబాస్ రాములు

నవతెలంగాణ-కోటగిరి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు దుబాస్ రాములు అన్నారు. బుధవారం తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దుబాస్ రాములు, ఏ. విట్టల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని అన్నారు. కార్మికులు అప్పులు చేసి మరి పిల్లలకు భోజనం పెడుతున్నారని, కార్మికులను సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఆరు నెలలు గడిచిందని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనాలు 10వేల రూపాయలు చెల్లిస్తామని చెప్పారని, వంట పాత్రలు కొనిస్తామన్నారని అన్నారు. జిల్లాకు 10 కోట్లు పెండింగ్లో ఉన్నాయని, ఆ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే ఏఐటీయూసీ నాయకులకు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆలీ, వీరేశం, ఉష, సరిత, సత్యవతి, నాగమణి రమణమ్మ, సిపిఐ నాయకులు నల్లగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

- ఎంపిడిఓ అనంత్ రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందర మొక్కలను నాటి పర్యవరణ పరిరక్షణకు పాటు పడాలని ఎంపీడీవో అనంత్ రావు పిలుపునిచ్చారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి డిప్‌చంద్‌తో కలిసి గ్రామ పంచయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు. తమ ఇంటి ముందర ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటాలన్నారు. పెండ్లి, పుట్టినరోజు సందర్భాలను బట్టి మొక్క నాటాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నాగేష్, కారోబర్ నర్సయ్య, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

జీపి సిబ్బందికి రెయిన్‌కోర్టులు అందజేత

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి వర్షాకాలన్ని దృష్టిలోఉంచుకొని రెయిన్ కోర్టులను బుధవారం ఎంపీడీవో అనంతరావు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డీప్‌చంద్‌ల ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా ఉంచడానికి గ్రామపంచాయతీలో విధులు నిర్వహించే సిబ్బంది కృషి ఎనలేనిది అన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. వారి కోసం గ్రామపంచాయతీ నిధుల నుండి రెయిన్ కోట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నగేష్, కారోబార్ నర్సయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కాకుంటే మాకు చెప్పండి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- రుణమాఫీపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఎవరికైనా రుణమాఫీ కాకుంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొదటి విడత లో రూ లక్ష వరకు 17,231 మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. రెండవ విడత రూ.1.50 లక్షల లోపు 7497 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్టు వెల్లడించారు. రైతులు సంబరాలు చేసుకోవడం గర్వంగా ఉంది అని అన్నారు. అదేవిధంగా 2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు ఆగస్టు 15 వ తేదీ లోపే మూడవ విడత రైతు రుణమాఫీ అవుతుంది అని తెలిపారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, దేశంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విదంగా తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తుంది అని అన్నారు. ఎవరికైనా రైతులకు రుణమాఫీ కానీ ఎడల తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సూచించారు. నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కారానికి విశేష కృషి

నవతెలంగాణ-కోటగిరి

మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో కోటగిరి ఉమ్మడి మండల దళిత సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్య వర్గానికి పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల మాల మహానాడు మండల అధ్యక్షులు మీర్జాపూర్ చిన్న సాయన్న మాట్లాడుతూ.. ప్రజల సమస్యల గురించి ప్రభుత్వానికి తెలిపి పరిష్కారం కోసం కృషి చేసే కీలకమైన పాత్రను విలేకరులు పోషిస్తారని అన్నారు. వారి ద్వారానే ప్రభుత్వానికి ప్రజల సమస్యలు పరిష్కరించే మార్గాలు చూపిస్తారని తెలిపారు. కలంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడేది విలేకరులని అన్నారు. సన్మాన కార్య క్రమంలో దళిత నాయకులు మండల మహానాడు ఉపాధ్యక్షులు కాలే సాయిలు, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కన్నం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రచార కార్యదర్శి కన్నం దవులయ్య, సీనియర్ నాయకులు కన్నం సాయిలు, దళిత నాయకులు పాల గంగారాం, జంగం సాయిలు బేగరి మారుతి, పుప్పాల సాయి కుమార్, కోటగిరి ఉమ్మడి మండల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి అర్ టి సి సాయిలు, హాస్గుల లాలయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్ర బడ్జెట్‌లో టీయూకు కేటాయింపుపై నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ యూనివర్సిటీకి నిధుల కేటాయింపులో జరిగినటు అన్యాయంపై భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద ప్లే కార్డులతో నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పేరు మీద ఉన్నటువంటి ఏకైక యూనివర్సిటీ తెలంగాణ యూనివర్సిటీ అని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో యూనివర్సిటీ అభివృద్ధికి ఎటువంటి నీదులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో యూనివర్సిటీ అభివృద్ధికి నోచుకోలేదని అనాడు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో అనేక సందర్భాల్లో మాట్లాడినట్లు వివరించారు. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు చాలా సందర్భాల్లో విమర్శించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్లో యూనివర్సిటీకి ఎందుకు మొండి చేయి చూపెట్టిందని ప్రశ్నించారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కేటాయించిన డబ్బులు జీతాలకు మాత్రమే సరిపోతుందని పేర్కొన్నారు. యూనివర్సిటీకి వీసీ, అధ్యాపకులు లేక యూనివర్సిటీ విద్యా వెనుకబడుతుందని, ప్రభుత్వం వెంటనే యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించి యూనివర్సిటీలో ఒక ఇంజనీ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగడం సాయి, తరుణ్, సంజయ్, శ్రీకాంత్, రియాజ్, హజారుద్దీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ ఇవ్వాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, అతిథిగా బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్న గారి మోహన్ హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు.రైతు రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ప్రామాణికంగా ప్రతి రైతుకు ఇస్తున్నామని మభ్యపెట్టి ఇవ్వడం లేదన్నారు. పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.ముఖ్యంగా వృద్ధాప్య పింఛను 4000, వికలాంగుల పెన్షన్ 6000, నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం 2500 ప్రతి మహిళకు, కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా 1,16,000, తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఇస్తామని, ఇప్పటి వరకు 8 నెలల కావస్తున్న ఇవ్వకుండా ప్రతి ఒక్కరిని మభ్య పెట్టి కాలయాపన చేయడాన్ని ఖండిస్తూ తక్షణం ఇచ్చిన హామీలను పూర్తి చేయాలన్నారు. పేదలకు ఇండ్లు కట్టుకుంటే ఐదు లక్షల, అలాగే స్థలం లేని వారికి స్థలం కూడా ఇవ్వాలని, సన్నబియ్యం పండించే రైతుతో పాటు అన్ని రకాల వరి పంటలకు కింటాకు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎత్తిచూపుతూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండల పరిషత్, ఎంపీటీసీ ,జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించే విధంగా కలిసికట్టుగా కార్యాచరణ రూపొందించుకొని పనిచేయాలని తీర్మానించారు. సమావేశంలో సంత లింగారెడ్డి, చింత ప్రవీణ్, సామ నరేశ్, నల్ల మోహన్, మల్లేష్ యాదవ్, శ్రీ రాముల శ్రవణ్, చింత మణికంఠ, కొత్తపల్లి అరుణ్, తోపు బాలు, చంద్ర మోహన్, లక్ష్మి నర్సయ్య, కొత్మీర్కర్ మహేష్, వై. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు పురస్కారం



నగదు పురస్కారం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం గోర్తి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తిరుపతి రెడ్డి నగదు పురస్కారం అందించారు. గత సంవత్సరం అధిక మార్కులు సాధించిన అక్షయ, దండుగుల ప్రవళికకు 3 వేల రూపాయల చొప్పున నగదు పురస్కారం అందజేశారు. యధావిధిగా వచ్చే సంవత్సరం 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు 5వేల రూపాయలు అందజేస్తామని అన్నారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి మాట్లాడుతూ... తిరుపతి రెడ్డి లాంటి వారు మారుమూల గ్రామాల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరోద్దీన్, ప్రవీణ్ శర్మ, రాజశేఖర్, విజయ్ కుమార్, గంగాధర్, జ్యోతి, శ్రీనివాస్, సబిత పాల్గొన్నారు.

పనిలో ప్రతిభ చాటారు

- సీడీపీవో ఉద్యోగ విరమణలో పలువురు

నవతెలంగాణ-మద్నూర్



సీడీపీవోను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రతి శాఖలో ఉద్యోగాలు చేసిన వారు ఉద్యోగ విరమణ తప్పదని, కానీ ఉద్యోగానికి న్యాయంగా పనిలో ప్రతిభ చాటినవారు ఐసిడిఎస్ సిడిపిఓ సునంద అని పలువురు పేర్కొన్నారు. ఆమె ఉద్యోగ విరమణ కార్యక్రమం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సిడిపిఓ సునంధ పనితీరుపై మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టుల్లో పని చేసిన కూడా అందరి మెప్పు పొందారని అన్నారు. ఎంపీడీవో రాణి, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి పద్మ, మండల కేంద్ర మాజీ ఎంపీటీసీలు గడ్డం లక్ష్మణ్, సంగీత కుశాల్, జిల్లా అధికారులు మండల అధికారులు మాజీ ప్రజా ప్రతినిధులు మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టులోని సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారిగా రామకృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి డివిజన్ అటవీశాఖ అధికారిగా రామకృష్ణ పదవి బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఇక్కడ ఇంతవరకు పని చేసిన గోపాలరావు జూన్‌లో విరమణ పొందగా ఆయన స్థానంలో రామకృష్ణ వచ్చారు. రామకృష్ణ ఇంతకు పూర్వం హైదరాబాద్‌లోని ఫారెస్ట్ అకాడమీ దూలపల్లిలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 2న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే లక్ష్మణ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు ముతూట్ గ్రూప్, ధరని ఇన్ఫ్రా హైదరాబాద్ కంపెనీ వారు ప్రొబిషనరీ ఆఫీసర్, ఇంటెర్న్‌షిప్ ట్రైనీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల నియామకాలు చేపడుతారని పేర్కొన్నారు. అర్హతలు ఇంటర్మీడియేట్, డిగ్రీ, బీ. టెక్, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం , శివాజీ నగర్ నందు ఉద్యోగ మేళ ఈనెల 2 న ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు, 9581768413, 9948748428, 6305743423, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని, అభ్యర్థులు తమ బయో డేటా,ఆధార్ కార్డులు, ఎస్సెసి మెమో, ఫొటో తీసుకొని రావాలని పేర్కొన్నారు.

గడ్డి మందు స్ప్రే చేయాలి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామపంచాయతీ నందు పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గడ్డి మందు స్ప్రే బుధవారం చేసినట్టు జీపీ కార్యదర్శి జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవో రాము ఆకస్మికంగా గ్రామన్ని సందర్శించారు. గ్రామంలోని విధులను, మురికి కాలువలను పరిశీలించారు. గడ్డి మందును ఉదయం కూలీలలతో పిచకారీ చేసామని, ముళ్లపొదలను తొలగించడం జర్గిమందని జీపీ కార్యదర్శి జీవన్ ఎంపీవోకు తెలిపారు.

జిపి అధికారి పనితీరు పట్ల హర్షం

- 15 రోజులకు ఒకసారి పశువుల నీటి తొట్టి శుభ్రం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రతంగల్లిలో గల పశువుల నీటి తొట్టిని గ్రామపంచాయతీ కార్యదర్శి పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రత్యేక దృష్టితో 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించడం పట్ల అధికారుల పనితీరుపై గల్లి ప్రజలు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలం అయినందున నీటి శుభ్రత పట్ల అధికారుల చర్యలు అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్ టైం ఛాన్స్ (సిబిసిఎస్) బిఎ, బీకాం, బీఎస్సీ, బి బి ఏ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు 27వ రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్ పరీక్షలు జరిగాయి. ఉదయం ఆరుగురు విద్యార్థులకు ఐదుగురు హాజరయ్యారనిఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

దూరవిద్యకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణ కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-2025 విద్యాసంవత్సరం నకు దూర విద్య ద్వారా డిగ్రీలో ప్రవేశానికి ఆగస్టు 18 వరకు చివరి అవకాశం కలదని ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు ఈ నెంబర్లకు 9848581970.738292980 సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పదోన్నతులు పొందిన అధ్యాపకులకు సన్మానం


అధ్యాపకులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్)లో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వర్ రావు, అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ సరసాని చంద్రిక ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు పొంది, కళాశాలను వీడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని వారిని వైస్ ప్రిన్సిపల్ ఆర్. ఉదయిని, అకాడమిక్ కో ఆర్డినేటర్ కే. వనజ అధ్యాపక బృందం సన్మానించి, వీడ్కోలు పలికారు.

బాలుర హాస్టల్ పరిశీలించిన ప్రిన్సిపాల్


బోజనాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్నా తెలంగాణ విశ్వవిద్యాలయంలోని దక్షిణ ప్రాంగణంలో బాలుర హాస్టల్‌ను, పరిసరాలను ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ గౌడ్ బుధవారం పరిశీలించారు. అనంతరం హాస్టల్ సిబ్బందికి తగు సూచనలు చేసి వారు ప్రతిరోజు పరిశుభ్రంగా ఉండడానికి కోసం వంట చేసే సమయంలో చేతి గ్లౌజులు, కిచెన్ క్యాప్‌ను కచ్చితంగా ధరించాలని సూచించారు. విద్యార్థులకు, హాస్టల్ సిబ్బందికి వసతి గృహంలో పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ యాలాద్రి, డాక్టర్ ఎస్ నారాయణ, కేర్ టేకర్ వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

1962 సేవలపై, సమస్యలపై పట్టింపులేదా?

నవతెలంగాణ-ఆర్మూర్

1962 సేవలను, సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైద్యులు కాంతయ్య, అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా ప్రారంభం..

ఆనాటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 1962 సంచార పశువైద్య వాహనాలను రాష్ట్రంలోని నియోజకవర్గానికి 1 చొప్పున మొత్తం 100 అంబులెన్సులను 2017వ సంవత్సరం లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. 1962 వాహనాలు గ్రామీణ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో మూగజీవులకు వైద్యం అందిస్తూ పాడి రైతుల మన్ననలు పొందాయి. ఒక్కో అంబులెన్స్‌కు ఒక పశువైద్య అధికారి ఒక పారవేట్ డ్రైవర్ హెల్పర్లు ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది సిబ్బందితో సేవలు అందిస్తున్నారు.. క్షేత్ర స్థాయిలో పనిచేసే వాహన సిబ్బందికి సకాలంలో జీతాలు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత 15 నెలలు గా ప్రభుత్వం 1962 సంచార వాహనాలను నిర్వహిస్తున్న సంస్థకు నిధులు చెల్లించకపోవడంతో 13 నెలలుగా సంస్థ ఉద్యోగులకు సొంతగా జీతాలు చెల్లిస్తుంది. గత రెండు నెలల నుండి సంస్థ కూడా ఉద్యోగులకు జీతాలు నిలిపివేయడంతో ఉద్యోగులు భవిష్యత్తు అగమ్య గోచారంగా మారింది. ప్రభుత్వం నిధులు సకాలం లో ఇవ్వకపోయినా క్షేత్ర స్థాయిలో అంతరాయం కలుగకుండా సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయటంలో జాప్యం చేస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు .

.అరకొర జీతాలతో..ఉద్యోగుల "పస్తులు,.....

1962 సంచార పశువైద్య వాహన సేవలు అందించే సిబ్బంది అరకొర వేతనాలు అందుతున్న అంకిత భావంతో పని చేస్తూ తమ నిబద్ధతను చాటుతున్నారు.అయినప్పటికి ప్రభుత్వం అరకొర వేతనాలు అందిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువైద్యానికి అందించే నిధులను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, అందిస్తున్నాయి. వైద్యులకు 35వేలు, అసిస్టెంట్‌కు 14వేలు, డ్రైవర్లకి 8వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం పశువైద్యునికి 56వేలు, అసిస్టెంట్ కి 20వేలు, డ్రైవర్లకి 18వేలు, చొప్పున చెల్లించాలని నిబంధన ఉన్నా అమలు చేయడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం 10శాతం ఇంక్రిమెంట కూడా ఇవ్వడం లేదని, గత 7 సంవత్సరాల నుండి ఇదే జీతంతో గడుపుతున్న తమ సమస్యలు తీర్చాలని వారు నవతెలంగాణకు తెలిపారు.


1962 వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

కొత్త చట్టలపై అవగాహన


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కుప్రియాల్ గ్రామ స్టేజి వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యముల చట్టం ఈ మూడు చట్టాల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సహ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం పాల్గొని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, విద్య హక్కు చట్టం మొదలగు చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారుడు మధురి శ్రీనివాస గుప్తా, మొహమ్మద్ అబ్దుల్ లతీఫ్ మరియు పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థి నీలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిల్లేర్గి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో 9.8 గ్రేడ్ సాధించి బాసర ఐఐటిలో సీటు పొందిన గంగామణి పేద విద్యార్థికి మండల లైయన్స్ క్లబ్ వారు స్పందించి 10 వేల రూపాయలను బుధవారము అందించారు. ఈ సందర్భంగా లైయన్స్ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడమే కాకుండా అనాథ విద్యార్థులకు విద్యతోపాటు పలకలు , నోట్ బుక్స్ బ్యాగ్గులు , స్కూల్ యూనిఫార్మ్ అందిస్తూ సేవలందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ సభ్యులు కొంత రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను అవమానిస్తే చర్యలు

ఏఎస్ఐ లింబాద్రి

నవతెలంగాణ-పిట్లం

దళితులను అవమాన పరిచినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ లింబాద్రి అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్ (కలాన్) గ్రామంలో సివిల్ రైట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను ఎవరైనా కాలా రాసినా, వారిని అవహేళనకు గురిచేసినా, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించి, కించపరిచిన , అంటరాని వారిగా పరిగణించిన ఎంతటి వారైనా ఇండియన్ క్రిమినల్ యాక్ట్ ప్రకారం ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్ కులకర్ణి సీతల్, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామ పెద్దలు , దళిత సంఘాల నాయకులు , దళిత కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం


పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూరు గ్రామపంచాయతీలో గత 3సంవత్సరాల 6 నెలలుగా గ్రామానికి సెక్రెటరీగా దేవిసింగ్ ఎన్నో సేవలు అందించారని స్థానికులు పేర్కొన్నారు. బదిలీపై వేరే గ్రామానికి వెళుతున్నందున గ్రామ పెద్దలు అందరూ కలిసి బుధవారం శాలువాతో సన్మానం చేశారు. అందరితో కలిసిమెలిసి ఉండే వారని గ్రామ ప్రజలు కొనియాడారు. గ్రామాన్ని వదిలిపెట్టడం కొంచెం బాధగా ఉందని అన్నారు. దేవి సింగ్ మాట్లాడుతూ తాను ఎక్కడికి వెళ్ళినా ఉత్నూర్ గ్రామ ప్రజల ప్రేమ అభిమానాలు ఎప్పటికీ మర్చిపోను అని అన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవో దంపుతుకు సన్మానం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్ పదవి విరమణ సంద ర్భంగా మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, మాజీ ఎంపీపీ శారదా నాగరాజు శాలువాతో ఆయనను బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి లు రమేష్, అంజయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది సమాచారం ఇచ్చారు. చాలా సంవత్సరాలుగా మదన్ మోహన్ రావు నిత్యం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా ఆగస్టు 01తారీకఖు నాడు ఉదయం సమయం 10 గంటల నుండి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణవేణి పాఠశాలలో బోనాల సంబరాలు


బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో బోనాల సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనామెత్తారు. విద్యార్థులు పోతరాజు వేషదారణతో సందడి చేశారు. బోనాల ఉత్సవాలు గ్రామదేవతలను ఆరాదించే పండుగగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఈ పండుగ ఎంతో ప్రసిద్ధి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్ పాఠశాల డైరక్టర్లు నాగేశ్వరావు,విజయ్ కర్తన్,మొహ్సిన్ జాబ్రీ, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామానికి చెందిన నారం లక్ష్మి (కర్రెవ్వ) అనారోగ్యంతో బుధవారం మరణించారు. వారి కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని డిచ్ పల్లి గల్ఫ్ సంఘం సభ్యులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఒడ్డం తులిసి దాస్, జలగడుగుల అశోక్, బాజన్న సందీప్, నరేష్, సుమన్, భూమయ్య, చిట్టీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మంథని గ్రామంలో బుధవారం స్పెషల్ ఆఫీసర్ గజానను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిలని సూచించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులకు పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్న ప్రాంతాలను పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖలో ఎ. దేవ్‌రావ్-ఎస్ఐ, సిటిసి, జాన్కంపేట్, నిజామాబాద్ పోలీస్ శాఖలో సర్వీసు పూర్తి చేసి పదవి విరమణ చేశారు. డి. మహేంధర్, ఎస్ఐ, పోలీస్ కంట్రోల్ రూమ్, నిజామాబాద్ పోలీస్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఎస్. గ్యాన్ సింగ్-ఎస్ఐ. పోలీస్ కంట్రోల్ రూమ్ ఉద్యోగ విరమణ చేశారు. ఎమ్. సత్యనందమ్, ఎఎస్ఐ, నిజామాబాద్ టౌన్ 5 పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం పదవి విరమణ వీడ్కోలు కార్యాక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వ హించారు. వీరికి శాలువాలతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి సర్టిఫికెట్ (జ్ఞాపికలతో) అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవర్, ఐపియస్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పనిఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటిరిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఎలాంటి అవసరం వచ్చిన ఎల్లవేళల సహాయపడతామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసిపి (అడ్మిన్) బి. కోటేశ్వరరావు, ఎఓ శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంటు శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో బడ్జెట్‌పై చర్చ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబు గోపిశెట్టి ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ ఆన్ యూనియన్, స్టేట్ బడ్జెట్- 2024పై చర్చ నిర్వహించారు. ఈ చర్చా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి హాజరై మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థను ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాల్లో బడ్జెట్ ప్రధానమైనదని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు, సామాజిక న్యాయం, ధరల స్థిరత్వం, అంతర్జాతీయ చెల్లింపుల సమతుల్యతలు బడ్జెట్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. కేంద్ర బడ్జెట్, వికసిత్ భారత్ లక్ష్యానికి రోడ్ మ్యాప్‌లాగా ఉందన్నారు. పేదలు, యువకులు, మహిళలు, వ్యవసాయ ప్రధానంగా ఈ బడ్జెట్లో కేటాయింపులు ఉండడం స్వాగతించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి మాట్లాడుతూ.. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదలను అరికట్టి ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ఈ బడ్జెట్ దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లను సమీక్షించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబు పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకంగా సర్టిఫికెట్ తో పాటు వాణిజ్యశాస్త్ర పుస్తకాలను అందించారు.కేంద్ర,రాష్ట్ర, బడ్జెట్ సమీక్షలో ఉత్తమంగా బడ్జెట్ ప్రజెంట్ చేసిన నలుగురు విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ ఆంజనేయులు, ప్రొఫెసర్ సంపత్ కుమార్, డాక్టర్ ఏ.పున్నయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో కే అపర్ణ, ప్రొఫెసర్ కైసర్ మహమ్మద్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ డాక్టర్, వి.దత్త హరి, డాక్టర్ గంగాధర్ డాక్టర్ జి శ్రీనివాస్ , డాక్టర్ శ్వేత డాక్టర్ పిట్ల సరిత, డాక్టర్ కిరణ్ రాథోడ్, రాజు వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

తల్లిపాల వారోత్సవాలను జయప్రదం చేయాలి

- ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్టు సిడిపివో జానకి

నవతెలంగాణ-ఎడపల్లి

తల్లి పాల వారోత్సవాలను అంగన్వాడీ ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్టు సిడిపివో జానకి అన్నారు. మండలంలోని జాన్కాంపేట్ సెక్టార్ పరిధిలో మండల అంగన్వాడీ ఉపాధ్యాయులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 1వ తారీకు నుండి వారం రోజులపాటు మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతపై మైల గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడి ఉపాధ్యాయులతో పాటు ఆశ వర్కర్లు కలిసి రెండు సంవత్సరాల రెండు నెలలలోపు ఉన్న బాలింతల ఇళ్లను తప్పకుండా సర్వే నిర్వహించి జాబితాను తయారు చేయాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రపాలు తప్పనిసరిగా పట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 40 అంగన్వాడి కేంద్రాలు నందున రెండు లేదా నాలుగు అంగన్వాడి కేంద్రాల గర్భిణీలను, బాలింతలను కేంద్రానికి రప్పించి వారికి తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను తెలపాలన్నారు. ఆగస్టు ఒకటి నుండి వారం రోజులు ప్రతి కేంద్రంలో ఈ ఉత్సవాలను అంగన్వాడి ఉపాధ్యాయులు తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలోఐ సి డియాస్ ఎడపల్లి మండలపర్యవేక్షికరాలు విజయ రాణి, అంగన్వాడి ఉపాధ్యాయులు వకులాదేవి, శారద, కల్పన సంజన, గంగా లక్ష్మి బండ కళ్యాణి అనురాధ సుజాత, అనిత తులసి, గంగమణి, నాగమణి, వీణ, షబానవేగం, సువర్ణ, విజయలక్ష్మి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిడిపివో జానకి

క్షత్రియ మహిళల బోనాల ఉత్సవాలు


బోనాల పండుగలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ క్షత్రియ మహిళ మండలికి చెందిన మహిళలు బుధవారం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. క్షత్రియ భవన్ నుంచి నుంచి దాదాపు 50మంది మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఆ తర్వాత బోనాలతో పోచమ్మ ఆలయం వరకు డప్పులు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు కురవాలని గ్రామదేవతలను కోరుకున్నారు. అనంతరం పోచమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలందరూ సామూహిక భోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ మహిళా న్యాయవాది, మున్సిపల్ కౌన్సిలర్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర మహిళా మండలి సలహాదారులు సంగీత ఖాందేష్ హాజరయి బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమములో గ్రామ క్షత్రియ సమాజ్ అధ్యక్షులు ఖాందేష్ సుదర్శన్, కార్యదర్శి అల్జాపూర్ నంద కిషోర్, కోశాధికారి గుజరాతీ రామ్ దాస్, రాష్ట్ర నాయకులు జెస్సు అనిల్, క్షత్రియ మహిళా మండలి సభ్యులు సుజాత, రేఖ, వాణి, లత, సరస్వతి, మంజుల, రూప, శ్వేత అల్జాపూర్ రాజ సులోచన, జెస్సు లలిత, సాత్ పుతే మంజుల, గౌతమి, మేఘ ఇంద్ర, కవిత, శ్రీలక్ష్మి, లత, గీత, సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల విద్యార్థులకు నమూనా మూట్ కోర్టుపై మౌఖిక పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బి చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు నమూనా మూట్ కోర్ట్ మౌఖిక పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఈ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా నిజామాబాద్ కు చెందిన సీనియర్ న్యాయవాది రమా గౌడ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనా కోర్టు,

కోర్టులో సంఘర్షణ వాజ్యాల విచారణలపై పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగపతి డాక్టర్ కె.ప్రసన్న రాణి, చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోస, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగజ్యోతి, న్యాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీశాఖలో పలువురి బదిలీలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అటవీ శాఖలో పలువురు సెక్షన్, బీట్ అధికారులు బదిలైనట్లు ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ బుధవారం తెలిపారు. ధర్పల్లి డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారిగా విధులు నిర్వహించిన ఆసిఫ్ ఉద్దీన్ హైదరాబాద్‌లోని విజిలెన్స్ కు బదిలీ అయ్యారు. యానంపల్లి సెక్షన్ అధికారిగా ఉన్న పి. బాపురావు కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని కోనాపూర్‌కు, సుబ్బారావు జాతీయ రహదారి నుండి కొడిమ్యాల రేంజ్ పరిధికి, ఆనంద్ నాయక్ అమ్సన్ పల్లి నుండి కడెం రేంజ్ పరిధిలోని గంగాపూర్ కు, సురేందర్ నుండి పరిధిలోని ఇస్లాంపూర్ కు బదిలీపై వెళ్లారు. వీరితో పాటు ఐదుగురు బీట్ అధికారులు బదిలీనట్లు రేంజ్ అధికారి రవి మోహన్ బట్ వివరించారు. పవన్ కుమార్ ఇందల్ వాయి రేంజ్ నుండి కమ్మర్పల్లి రేంజ్ కు, టి.వినోద్ కుమార్ కొరటపల్లి నుండి వర్ని రేంజ్ కు, టీ.హైందవరాణి పడకల్ నుండి కమ్మరపల్లి రేంజ్ కు, బి శిరీష ఓన్నజి పేట్ నుండి కమ్మర్‌పల్లికి, శ్రీకాంత్ సికింద్రాపుర్ నుండి రావుట్ల సిరికొండ మండలానికి బదిలీపై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌గా వీధులను నిర్వచించిన ఎస్ నాగరాణి ఇందల్వాయి నుండి నిజామాబాద్ లోని నార్త్ రేంజ్ కు బదిలీ కాగా, నార్త్ రేంజ్ లో విధులు నిర్వహిస్తున్న సుమలత ఇందల్వాయ్ రేంజ్ సీనియర్ అసిస్టెంట్గా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ముగ్గురు సెక్షన్ అధికార్ల బాధ్యతల స్వీకరణ..

ఖాళీ అయిన సెక్షన్ అధికారుల స్తానంకు ముగ్గురితో భర్తీ చేయనున్నారు. కమ్మర్పల్లి రేంజ్ లో విధులు నిర్వహిస్తున్న శిక్షణ అధికారి తుకారాం రాథోడ్ డిప్యూటీ రేంజ్ అధికారి ధర్పల్లి సెక్షన్ అధికారిగా వీధుల్లో చేరనున్నారు. ఆర్మూర్ రేంజ్ నుండి శ్రీకాంత్ యానంపల్లి సెక్షన్ అధికారిగా, నిజామాబాద్ నార్త్‌లో విధులు నిర్వహిస్తున్న భాస్కర్ ఓన్నజిపేట్ సెక్షన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి రవి మోహన్ బట్ మాట్లాడుతూ నిర్వహణలో అంకితభావంతో బదిలీపై వెళ్లినవారు పని చేశారని వారు చేసిన కృషి మరువలేనిది అన్నారు ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని ఎక్కడికి వెళ్లినా మనస్ఫూర్తిగా వీధులు నిర్వహించే విధంగా చూసుకుంటూ ఉన్నతాధికారుల మనసును చురకొనే విధంగా చూడాలని బదిలీ అయిన వారిని కోరారు.